క్లుప్తంగా

'రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం'

ఆత్మకూరు : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయారని చెప్పారు. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలు విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇర్సడ్ల సదానందం, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, గట్టు వేణు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



అరెస్టైన బీజేపీ నాయకులు

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండలంలోని సోడషపల్లి గ్రామంలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించిన నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులను పోలీసులు సోమవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. అరెస్టైన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు యాదవ్, కీర్తి సురేష్, ముద్దసాని వీరన్న, మాలోతు రాజు, చొప్పరి రాజేష్, ధరావత్ రాజ్‌కుమార్, మాలోతు రాము, మాలోతు అంజి, మాలోతు చందు, రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సద్దాం హుస్సేన్, జల్తార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

'మున్నూరు కాపు' ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నిరంజన్



నిరంజన్‌కు నియామక పత్రం అందజేస్తున్న రవిచంద్ర, దేవయ్య పటేల్

కమలాపూర్ : మున్నూరు కాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన సల్ల నిరంజన్ నియమితులయ్యారు. ఈ మేరకు నిరంజన్‌కు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర (గాయత్రి రవి), సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ సోమవారం నియామక పత్రం అందజేశారు. కాగా నిరంజన్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. నిరంజన్ నియామకం పట్ల మున్నూరు కాపు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

చేయూత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన సింగారపు సురేష్, దైనంపల్లి ఓదమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ సోమవారం క్వింటా చొప్పున బియ్యం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. తొలుత బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సురేష్, ఓదమ్మ కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు మారెపెల్లి మోహన్, దైనంపల్లి కరణ్‌బాబు, పాపయ్య, రాజయ్య, బత్తుల కార్తీక్, గాజు రాజేందర్, వడ్డేపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగ' దండోరా ఆవిర్భావ వేడుకలు



ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్ ఆవరణలో మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అంధ విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం దండోరా రాష్ట్ర నాయకుడు పాలిమేర బాలస్వామి మాట్లాడారు. మాదిగ ప్రజల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం చైతన్యయుత పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. పాలకులు అవలంబిస్తున్న మాదిగ వ్యతిరేక విధానాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల సురేష్, రాజేష్, ఆనంద్‌పాల్, దాట్ల అరుణ్, అంబాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు.. కోతులు.. పందులతో
వేగలేకపోతున్నాం

'సాక్షి ఫోన్ ఇన్'కు పరకాల ప్రజల ఫిర్యాదుల వెల్లువ

- రోడ్లపైనే ఆవుల సంచారంతో ఇబ్బందులపై మొర
- సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి వినతులు
- ప్రతిపాదనలు చేశాం.. నిధులు రాగానే మిగతా అభివృద్ధి
- హామీ ఇచ్చిన మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి



ప్రజలతో ఫోన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్ స్వామి

పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'మున్సిపల్ కమిషనర్ ఫోన్‌ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పందులు, కుక్కలు, కోతుల బెడదపై కమిషనర్ శేషాంజన్ స్వామికి మొరపెట్టుకోగా పరిష్కార చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరికొందరు రోడ్లు, అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీలతో దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని తెలపగా తక్షణమే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులు.. కమిషనర్ ఇచ్చిన సమాధానాలు ఇలా..

లక్కం శంకర్(న్యాయవాది): పట్టణంలో కుక్కలు, కోతులు, పందుల బెడదతోపాటు రోడ్లపైనే ఆవులు సంచరిస్తూ వాహనాదారులను ఇబ్బందులు పెడుతున్నాయి.

కమిషనర్: ఆవులను రోడ్లపై వదిలిపెట్టవద్దని యజమానులకు జరిమానా కూడా విధించాం. అవసరమైతే గోశాలకు తరలించే చర్యలు తీసుకుంటాం

మెరుగు రమేష్: సాహితీ కళాశాల సమీపంలోని ఖాళీ స్థలంలో పందులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దుర్వాసన వస్తుంది.

కమిషనర్: ఖాళీ స్థలాల వారికి నోటీసు ఇస్తాం. పందులు ఉండకుండా చర్యలు తీసుకుంటాం.

మహ్మద్ సాధిక్: పాత సీఎంఎస్ గోదాం సమీపంలోనే పశువులను వధించడంతోపాటు వాటి వ్యర్థాలు తినటానికి కుక్కలు సంచరిస్తున్నాయి.

కమిషనర్: నిజమే మా దృష్టికి వచ్చింది. అక్కడ పశువులను వధించకుండా చర్యలు తీసుకుంటాం.

గంధం శ్రీనివాస్, దేవులపల్లి సతీష్: నటరాజ్ థియేటర్ రోడ్డు గుంతలమయంగా మారింది. నటరాజ్ టాకీస్ రోడ్డులో సీసీ, డ్రెయినేజీలు లేవు.

కమిషనర్: ఇప్పటికే రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు రూపొందించాం. నిధులు మంజూరు కాకపోవడం వల్ల ఆలస్యమవుతుంది.

కాచం రవిప్రసాద్: పరకాల ఎస్‌బీఐ రోడ్డులో కుక్కలు, కోతులు, పందులతోపాటు ఆవులు గుంపులుగా సంచరిస్తూ ఇబ్బందులు పెడుతున్నాయి.

కమిషనర్: కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. తర్వాత పందులు, కోతుల తరలింపు చర్యలు చేపడుతాం.

రమేష్‌బాబు: పాత మేదరివాడకు వెళ్లే దారికి ముందు డ్రెయినేజీ పైపు కూరుకుపోయి మురుగునీరు నిలిచిపోతుంది. పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి.

కమిషనర్: మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం

విజయసారథి, రాజేందర్: 7వ వార్డులోని సూర్య ఆస్పత్రి ఎదురుగా ఉన్న రోడ్డులో, మమతనగర్‌లో డ్రెయినేజీ నిర్మించాలి.

కమిషనర్:: ప్రతిపాదనలు చేశాం.

ఎండీ ఖలీం: 14వ వార్డులోని పెద్ద మసీదు సమీపంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

కమిషనర్: మున్సిపల్ సిబ్బందిని పంపి పిచ్చి మొక్కలు తొలగిస్తాం.

కేశెట్టి వెంకటేశ్వర్లు: 12వ వార్డులో సీసీ రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

కమిషనర్: రోడ్డు వెడల్పులో కొందరు అభ్యంతరం చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. వారితో మరోసారి మాట్లాడే ప్రయత్నం చేస్తాం.

చెంగల్‌రావు: టీచర్స్ కాలనీకి సీసీ రోడ్డు లేదు. అదే కాలనీలో పాతబావి ఉండడం వల్ల ప్రమాదం పొంచి ఉంది.

కమిషనర్: రోడ్డు మంజూరైంది. బావికి ఫెన్సింగ్ చేయిస్తాం.

గనిశెట్టి వేణు: మమతనగర్‌లో కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయి.

కమిషనర్: ఇప్పటికే కుక్కల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం త్వరలో కోతులు పట్టే వారితో పట్టిస్తాం.

బాసాని దయాకర్: పాత కోర్టు సమీపంలోని కాలనీలకు స్వచ్ఛ వాహనాలు రాకపోవడంతో చెత్త పేరుకుపోతోంది.

కమిషనర్: రోజు వారీగా స్వచ్ఛ వాహనాలు వచ్చేలా చూస్తాం.

గాజుల నిరంజన్: హౌసింగ్ బోర్డు సమీపంలోని కాలనీకి సీసీ రోడ్డు లేకపోవడంతో చెత్త తీసుకెళ్లే వాహనాలు రావడం లేదు.

కమిషనర్: సీసీ రోడ్డుకు ప్రతిపాదనలు చేశాం. నిధులు లేకపోవడంతో వేయలేదు. రోజూ చెత్త వాహనం పంపిస్తాం.

విజయ్‌కుమార్: సీఎస్ఐ కాలనీలో డ్రెయినేజీ తీయడం లేదు.

కమిషనర్: డ్రెయినేజీ తీయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించాను.

బొచ్చు రాజు: విద్యాలయ స్కూల్ సమీపంలో ఇళ్ల పైనుంచి విద్యుత్ తీగలు ఉన్నాయి.

కమిషనర్: సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పోల్స్‌ను అవసరమైన మేరకు జరిపించే ప్రయత్నం చేస్తాం.

మొక్కల దత్తత.. సంరక్షిస్తాం



దత్తత తీసుకున్న మొక్కల వద్ద విద్యార్థినులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే (ఎంజేపీ) బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను దత్తత తీసుకున్నారు. వాటిని సంరక్షిస్తామని స్పష్టం చేశారు. ఈనెల 22న పాఠశాలను సందర్శించిన ఎంపీడీఓ విద్యార్థినులందరూ ఒకటి చొప్పున మొక్కలను దత్తత తీసుకుని సంరక్షించాలని, సదరు మొక్కలకు రాఖీ కట్టాలని, ఆ మొక్కపై పేరుండేలా గుర్తింపు కార్డు ఏర్పాటు చేయాలని సూచించిన విషయం తెలిసిందే. అలా చేసిన వారికి పర్యావరణ పరిరక్షణ దినోత్సవ రోజున సర్టిఫికెట్ ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో ఆయన సూచన మేరకు పాఠశాలకు చెందిన 500 మంది విద్యార్థినులు సోమవారం మొక్కలను దత్తత తీసుకుని గుర్తింపు కార్డులు ఏర్పాటు చేశారు. ఇక నుంచి మొక్కల సంరక్షణ బాధ్యత తామే చూసుకుంటామని ఎంపీడీఓకు హామీ ఇచ్చారు. మొక్కలను దత్తత తీసుకున్న విద్యార్థినులతోపాటు చొరవ చూపిన ప్రిన్సిపాల్ ప్రఫుల్లాదేవి, ఉపాధ్యాయులను ఎంపీడీఓ పల్లవి అభినందించారు.

చదువుతోనే బంగారు భవిష్యత్‌కు బాటలు



పండ్లు పంపిణీ చేస్తున్న కుమార్, రాజు

ఐనవోలు : చదువుతోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోగలరని 'మన ఊరు–మన బాధ్యత' నియోజకవర్గ కోఆర్డినేటర్ దోమ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను సోమవారం సందర్శించారు. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు అమలౌతున్న స్నాక్స్ ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. అనంతరం కుమార్ మాట్లాడారు. విద్యార్థులకు ఫౌండేషన్ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పొన్నాల రాజు, హెచ్ఎం ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతికి నివాళి



పరకాల : కేఎంసీ పీజీ విద్యార్థి డాక్టర్ ప్రీతికి బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మడికొండ శ్రీను మాట్లాడారు. ప్రీతి ఆత్మహత్య బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సోదా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దేశరాజుపల్లిలో..



కమలాపూర్ : కేఎంసీ పీజీ విద్యార్థిని ప్రీతికి మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయ కూడలిలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తేవాలని నినాదాలు చేశారు.

'వనదర్శిని'తో మానసికోల్లాసం



విద్యార్థులతో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మయూరి

ఎల్కతుర్తి : 'వనదర్శిని' కార్యక్రమంతో విద్యార్థినిలకు మానసికోల్లాసం లభిస్తుందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు మండల కేంద్రంలోని కాకతీయ వనవిహార్ పార్క్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మయూరి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏటా వనసందర్శిని కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థినులకు చిల్డ్రన్స్ పార్కులోని వృక్షాలను, పలు రకాల చెట్ల ప్రాముఖ్యత, ఓపెన్ జిమ్ గురించి వివరించారు. విద్యార్థినులకు ఉల్లాసం కల్పించడంతోపాటు మేధాశక్తిని వనదర్శిని పెంపొందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీట్ అధికారి వెంకటేశ్వర్లు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినులను అభినందిస్తున్న తహసీల్దార్

దామెర : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్ కోరారు. హనుమకొండలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించగా వారిని ఆయన సోమవారం అభినందించి మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థినులు మనోజ్ఞ, చందన, ప్రవళిక, ప్రణయణ, దివ్య, వైష్ణవి, పూజిత, రాధిక, రమ్యశ్రీ, జస్వనికలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, పీఈటీ కమలాకర్, కరాటే కోచ్ అన్వర్ పాల్గొన్నారు.

ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

పరకాల : కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి, నర్సంపేటలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని అక్షిత ఆత్మహత్యపై విచారణ చేపట్టి దోషులపై కఠినంగా శిక్షించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రీతి, అక్షిత ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించడంతోపాటు ర్యాగింగ్‌ను అరికట్టి రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలు పునరావృత్తం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి, సంఘం అనుబంధ విద్యార్థి విభాగం అధ్యక్షుడు దేవరకొండ నరేష్ చారి, మహిళా విభాగం అధ్యక్షురాలు భీమగాని సౌజన్య, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రీతి' నిందితులను కఠినంగా శిక్షించాలి

శాయంపేట : కేఎంసీ పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు ఒడిగట్టేలా వేధించిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగ్గం సుమన్ డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జీతో కేసును విచారణ చేయించాలని కోరారు. సీనియర్ మెడికో సైఫ్, హెచ్‌ఓడీలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీతి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

వైద్యాధికారులను సస్పెండ్ చేయాలి

ఆత్మకూరు : కేఎంసీ మెడికో ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ వేధింపులతో ప్రీతి ఆత్మహత్యకు పాల్పడడం వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఘటనకు బాధ్యులైన వైద్యాధికారులను సస్పెండ్ చేయాలని, వైద్యశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

ఐనవోలు : డాక్టర్ ప్రీతి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రీతికి న్యాయం జరగాలంటే కేఎంసీ ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలను సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రీతి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ర్యాగింగ్ నివారణ కోసం షీటీమ్‌లను పటిష్ఠ పర్చాలని సూచించారు. ప్రీతి, రక్షితల ఆత్మహత్యకు కారకులైన సైఫ్, రాహుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మోసం



పాదయాత్రలో ఎమ్మార్పీఎస్ నాయకులు

పరకాల : కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బొడ్డు శాంతిసాగర్ మండిపడ్డారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాకుడు మంద కృష్ణ పిలుపు మేరకు మార్చి 15న హైదరాబాద్‌ను దిగ్బంధించనున్నట్లు తెలిపారు. ఈనెల 22 ధర్మసాగర్‌లో చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర పరకాలకు సోమవారం చేరుకోగా శాంతిసాగర్ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదిస్తామని హామీ ఇచ్చి 20 ఏళ్లు గడచినా అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, జిల్లా కోకన్వీనర్ గంగారపు శ్రీనివాస్, జిల్లా నాయకులు పాముల సుబ్బయ్య, ఏకు శంకర్, బొచ్చు మోహన్, మహేశ్, గోనెల రమేష్, బొజ్జ హేమంత్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, సోదా రామకృష్ణ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

కమలాపూర్ : పీఆర్సీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు మాట్లాడారు. నాలుగేళ్లకు ఓసారి ఇచ్చే పీఆర్సీని ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ పైడయ్య, ఏఈ రాములు, సబ్ ఇంజనీర్లు సుదర్శన్, మమత పాల్గొన్నారు.

నాడు దర్జా.. నేడు దిగాలు..

- నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం



భీమదేవరపల్లి : ఒకప్పుడు టైలర్ షాపు నిర్వహకులు దర్జాగా జీవనం గడిపే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సమాజంలో నూతన ఒరవడి చొరబడడంతో రెడిమెడీ దుస్తులు మార్కెట్లోకి వచ్చి దిగాలుగా దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ప్రజలు, ముఖ్యంగా యువత వస్త్రాల కొనుగోలుపై ఆసక్తి చూపకుండా రెడీమేడ్ దుస్తులకే ప్రాధాన్యత ఇస్తుండడంతో టైలర్లు కులవృత్తి సాగక పని దొరక్క అర్ధాకలితో అలమటిస్తున్నారు. నేడు (మంగళవారం) ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం..

శుభకార్యాలు, పండుగల సందర్భాల్లో ప్రజలు టైలర్ షాప్‌లో దుస్తులు కుట్టించడం పరిపాటి. టైలర్ షాపులు కళకళలాడేవి. టైలర్ షాపు యజమానుల, కార్మికులు దర్జాగా బతుకులు వెళ్లదీసే పరిస్థితి ఉండేది. మేరు కులస్తులకే కాకుండా ఇతరులకు సైతం ఉపాధి లభించేది. కాగా సమాజంలో వచ్చిన పెనుమార్పులు రెడీమేడ్ షాపులను మార్కెట్లోకి తీసుకురావడంతో టైలర్ షాపులపై దుష్ప్రభావం మొదలైంది. ఒకప్పుడు కేవలం హైదరాబాద్, వరంగల్ లాంటి పెద్ద పట్టణాలకే పరిమితమైన రెడిమెడీ దుస్తులు ప్రస్తుతం మండల, గ్రామ స్థాయి చేరుకున్నాయి. దీంతో చాలా మంది వృత్తిదారులు, టైలర్ షాపుల యజమానులు, కార్మికులు బతుకులు వెళ్లదీయడంలో ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను సుమారు 40 ఏళ్లుగా టైలర్ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నా. నాడు డ్రెస్ కుడితే రూ.50 గిట్టుబాటయ్యేది. ప్రస్తుతం మెటీరియల్ ధరలు పెరిగాయి. డ్రెస్ కుడితే రూ.800 తీసుకుంటున్నాం. గతంలో చాలా మంది బట్ట కొనుగోలు చేసి బట్టలు కుట్టించుకునే పరిస్థితి ఉండేది. ప్రభుత్వం మిషన్ కొనుగోలు, షాప్ ఏర్పాటుకు సబ్సిడీ రుణాలివ్వడంతోపాటు స్కూల్ విద్యార్థుల యూనిఫారాలు కేటీ పనిని వృత్తిదారులకు అప్పగించి ఆదుకోవాలి.

– గొల్లపల్లి శేఖర్, టైలర్ షాపు నిర్వహకుడు, ముల్కనూర్

విద్యార్థులకు అభినందన

శాయంపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ (జెడ్పీ) హైస్కూల్ విద్యార్థులు క్విజ్, పోస్టర్ తయారీ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలవగా వారిని పాఠశాల ఆవరణలో హెచ్ఎం వనం వెంకటేశ్వర్లు, సైన్స్ ఉపాధ్యాయులు సత్యప్రసాద్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటేశ్వర్లు మాట్లాడారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 24న పాఠశాలలో క్విజ్, పోస్టర్ తయారీ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కాగా పాఠశాల విద్యార్థులు విఘ్నేష్, సంజయ్, వంశీ ప్రతిభ చాటి మూడో స్థానంలో నిలిచారని చెప్పారు. ఈ క్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు సదరు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరింత ప్రతిభ చాటాలని ప్రధానోపాధ్యాయుడు కోరారు.